నేటి తెల్లవారుజాము నుంచి పెన్షన్ల పంపిణీ

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

అక్టోబర్ ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ కార్యక్రమం సజావుగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. పింఛన్లను సజావుగా పంపిణీ చేసేందుకు వారి పరిధిలోని లబ్ధిదారుల జాబితా ప్రకారం రూట్‌మ్యాప్‌ను రూపొందించుకొని ప్రణాళికబద్ధంగా పంపిణీ చేపట్టాలన్నారు. ఎలాంటి గందరగోళానికీ గురికాకుండా ఉండేందుకు పంపిణీకి ముందు రోజే బ్యాంకుల నుంచి నగదును విత్ డ్రా చేసుకుని సిద్ధంగా ఉంచామన్నారు. బయట ప్రాంతాల్లో ఉంటున్న లబ్ధిదారులకు ముందుగానే ఫోన్ ద్వారా సిబ్బంది సమాచారాన్ని ఇచ్చారన్నారు. ఉదయం నాలుగు గంటల నుంచే పింఛన్ల పంపిణీ చేపట్టి ఉదయం 10 గంటల్లోపు పూర్తి చేయాలని, సిబ్బందిని అప్రమత్తం చేసేందుకు మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు వారి పరిధిలో కంట్రోల్ రూమ్‌లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు.

దళిత నేతలపై పోలీసు నిర్బంధం

కెవిపిఎస్ రౌండ్‌టేబుల్ సమావేశాన్ని అడ్డుకున్న పోలీసులు

పలువురు నేతల గృహనిర్బంధం

ఉండి ఎంఎల్‌ఎపై చర్యలు తీసుకోవాలి: దళిత, ప్రజాసంఘాలు

ప్రజాశక్తి - భీమవరం

మాట్లాడుకునే... మాట్లాడే స్వేచ్ఛను సైతం టిడిపి కూటమి ప్రభుత్వం హరిసోంది. అడిగితే నిర్బంధం.. ప్రశ్నిస్తే అరెస్టులకు పాల్పడుతూ ప్రభుత్వం తన దమననీతిని ప్రదర్శిస్తోంది. వైసిపి ప్రభుత్వం అవలంబించిన నిర్బంధ విధానాన్ని టిడిపి కూటమి ప్రభుత్వం కొనసాగిస్తూ మరింత కర్కశత్వంగా వ్యవహరిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాళ్ల మండలం ఏలూరుపాడులో అంబేద్కర్ ఫ్లెక్సీ వివాదం తారాస్థాయికి చేరింది. ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు అంబేద్కర్ ఫ్లెక్సీని స్వయంగా తొలగించడం, ఆపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన సంగతి తెలిసిందే.

కెవిపిఎస్ నేత క్రాంతిబాబును బలవంతంగా తీసుకెళ్తున్న పోలీసులు

పాలకొల్లులో నల్లి రాజేష్ గృహనిర్బంధం

దీనిపై కొన్ని రోజులుగా నిరసనలు హోరెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా కెవిపిఎస్ ఆధ్వర్యంలో అన్ని దళిత సంఘాలను కలుపుకుని రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహణకు పిలుపునిచ్చారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు రౌండ్‌టేబుల్ సమావేశాన్ని అడ్డుకోవడానికి దళిత నేతలపై నిర్బంధం ప్రయోగించారు. ఆదివారం రాత్రి నుంచి జిల్లావ్యాప్తంగా దళిత నేతల కోసం జల్లెడ పట్టారు. నేతల ఇళ్లకు వెళ్లి గాలించారు. భీమవరం సిఐటియు కార్యాలయంలో ఉన్న కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కారుమంచి క్రాంతిబాబును భీమవరం రూరల్ సిఐ, కాళ్ల, పాలకోడేరు ఎస్ఐలు సోమవారం అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో అక్కడే ఉన్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, జిల్లా కార్యదర్శి ఎం.ఆంజనేయులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు వారితో కొద్దిసేపు వాగ్వివాదానికి దిగి క్రాంతిబాబును అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి క్రాంతిబాబు స్వగ్రామం మొగల్లు తీసుకెళ్లి అక్కడ గృహనిర్బంధం చేశారు. మాజీ ఎంఎల్‌ఎ, కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు దిగుపాటి రాజగోపాల్‌ను పాలకొల్లులోని ఆయన ఇంట్లో పోలీసులు గృహ నిర్బంధం చేశారు. దళితసంఘాల నేతలు నన్నేటి పుష్పరాజును ఆచంటలో, నల్లి రాజేష్‌ను పాలకొల్లులో గృహనిర్బంధం చేశారు. అయితే పోలీసుల తీరుపై విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. కొన్ని రోజులుగా ఉండి ఎంఎల్‌ఎ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసనలు పెల్లుబుకుతున్నా టిడిపి అధినేతలుగాని, ప్రభుత్వ పెద్దలుగాని కనీసం స్పందించకపోవడం దారుణమనే వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి.

అక్రమ నిర్బంధాలు అప్రజాస్వామికం

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు

ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్న వ్యాఖ్యలను ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజు ఉపసంహరిం చుకోవాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న అనంతరం క్రాంతిబాబు మాట్లాడారు. శాంతియుతంగా జరిగే రౌండ్‌టేబుల్ సమావేశంపై నిర్బంధం ప్రయోగించి అడ్డుకోవడం అప్రజాస్వా మికమన్నారు. రాజ్యంగ నిర్మాత అంబేద్కర్ ఫ్లెక్సీ పట్ల ఎంఎల్‌ఎ తీరు విస్మయం కలిగించిందన్నారు. ఫ్లెక్సీకి, మతానికి సంబంధం లేకపోయినా ఉద్దేశపూర్వకంగా ఎంఎల్‌ఎ రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. ఎంఎల్‌ఎను నియంత్రించకుండా ప్రజల గొంతుపై నిర్బంధం సబబు కాదన్నారు. ఇప్పటికైనా సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఎంఎల్‌ఎపై చర్యలు తీసుకోవాలి

ఎస్‌పికి దళిత, ప్రజాసంఘాల వినతి

చట్ట వ్యతిరేకంగా పని చేయడమే కాకుండా తన వీడియోల ద్వారా బేదాభిప్రాయాల్ని రెచ్చగొడుతున్న ఎంఎల్‌ఎపై చర్యలు తీసుకోవాలని దళిత, ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. స్థానిక ఎస్‌పి కార్యాలయంలో జిల్లా ఎస్‌పిని దళిత, ప్రజాసంఘాల నేతలు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు గొర్ల రామకృష్ణ, ఎం.ఆంజనేయులు, చిన్నం చిననాగేశ్వరరావు మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అందరివాడని, దానికి భిన్నంగా ఎంఎల్‌ఎ 'మీ వాళ్లు.. మా వాళ్లు' అంటూ మాట్లాడటం సరైనది కాదన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్‌కుమార్, సహాయ కార్యదర్శి మాదాసు గోపి, జిల్లా నాయకులు బాతు రామస్వామి, పి.ఇ.శ్యామ్, సిఐటియు నాయకులు ఇంజేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యమం ఉధృతం చేస్తాం

ఉండి ఎంఎల్‌ఎ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో అక్రమ నిర్బంధాలను ఖండించిన దళిత, ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి - భీమవరం

అంబేద్కర్ ఫ్లెక్సీని తొలగించడమే కాకుండా వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న ఉండి ఎంఎల్‌ఎ తన పొరపాటును గుర్తించి సరిదిద్దుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్‌కుమార్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కళింగ లక్ష్మణ్, దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్‌కుమార్ హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా పోలీసుల అక్రమ నిర్బంధాల నడుమ కెవిపిఎస్ ఆధ్వర్యంలో సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు వ్యాఖ్యలు ప్రజల మధ్య చీలికను సృష్టిస్తాయన్నారు. అంబేద్కర్ ఫ్లెక్సీ పట్ల దురుసుగా వ్యవహరించడం సబబు కాదన్నారు. ఫ్లెక్సీ అడ్డువస్తే అధికారులకు ఆదేశాలివ్వాలని,

అభివాదం చేస్తున్న దళిత సంఘాల నేతలు

లేదా సంబంధిత వ్యక్తులను పిలిపించి మాట్లాడాలని, అంతేగాని ప్రజాప్రతినిధి అలా వ్యవహరించం సరికాదని అన్నారు. ఫ్లెక్సీ విషయంలో ఇప్పటికైనా ఎంఎల్‌ఎ తన పొరపాటును గుర్తించి, తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని కోరారు. మతాల ప్రస్తావన రాజ్యాంగ విరుద్ధమన్నారు. తక్షణం రఘురామకృష్ణంరాజు తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, ఇదే కొనసాగితే జిల్లావ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గొర్ల రామకృష్ణ, కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు బాతు రామస్వామి, డిహెచ్‌పిఎస్ నాయకులు రత్నకుమార్, దళిత నాయకులు పట్టెం సుధాకర్‌రావు, తాటిపాక సుధాకర్‌రావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా రామ్మోహన్ రాయ్

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

కలెక్టరేట్ వద్ద ధర్నాలో సిఐటియు నేతలు

ప్రజాశక్తి - భీమవరం

పరిశ్రమలు, ప్రభుత్వరంగ సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యాన స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. కనీస ఉద్యోగ భద్రత లేకుండా నిత్యం కష్టాన్ని నమ్ముకుని పని చేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయడంతోపాటు పిఎఫ్, ఇఎస్ఐ వంటివి అమలు చేయాలని నేతలు డిమాండ్ చేశారు. సిఐటియు జాతీయస్థాయి పిలుపులో భాగంగా చేపట్టిన ఈ ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడారు. పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులతోపాటు పంచాయతీ, మున్సిపల్, విద్యుత్ ఇతర ప్రభుత్వ రంగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఉపాధి భద్రత లేదన్నారు. కనీసం కార్మిక చట్టాలు అమలు కాకపోవడం అత్యంత దారుణమన్నారు. గణపవరం మండలంలోని సిపిఎఫ్ కంపెనీ మూతపడి వందలాది కాంట్రాక్టు కార్మికులకు బకాయిలు సైతం అందలేదని ఆందోళన చెందుతున్నారన్నారు. చట్టప్రకారం కనీస వేతనం అమలు కావడం లేదని, ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సదుపాయాల ఊసే లేదని అన్నారు. పంచాయతీ, మున్సిపాల్టీల్లో కార్మికులు ఏళ్ల తరబడి పనిచేస్తున్నా పర్మినెంట్ కాకపోవడం వల్ల వారికి ఎటువంటి సౌకర్యాలూ అందడం లేదన్నారు. నెలలు తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉండటంతోపాటు సబ్బులు, నూనె, చెప్పులు, యూనిఫారం వంటివేమీ అందడం లేదని విమర్శించారు. చట్టాలు అమలు చేయాల్సిన అధికారులు పాలక పెద్దలకు లోబడి నిర్లిప్తతతో అమలు చేయడం లేదన్నారు. విద్యుత్ శాఖలో కార్మికులకు వేతనాలతోపాటు భద్రత సమస్య ఉందని, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా పట్టించుకునే నాధుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కార్మికులతో జాయింట్ సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు రంగాలవారీ వినతిపత్రాలు అందజేశారు. జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని, తప్పకుండా సమస్యలు పరిష్కరిస్తామని జాయింట్ కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు, శ్రీనివాస్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వరలక్ష్మి, రాజు, పంచాయతీ కార్మిక సంఘం నాయకులు శివరాం, ఏసుబాబు, విజయ, కార్మికులు పాల్గొన్నారు.

ఇ-క్రాప్ నమోదును వేగవంతం చేయండి

కలెక్టర్ సి.నాగరాణి

ప్రజాశక్తి - ఉండి

ఇ-క్రాప్ నమోదును వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వ్యవసాయ శాఖాధికారులను ఆదేశించారు. సోమవారం ఉండి మండలం ఉప్పులూరు, పాందువ్వ, మహదేవపట్నం గ్రామాల్లో ఇ-క్రాప్, ఇకెవైసి సూపర్ చెక్ రికార్డులను పరిశీలించిన ఆమె మాట్లాడుతూ పంట నమోదులో తప్పులున్న పక్షంలో సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా కలెక్టరు రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందాలన్నా, ధాన్యం కొనుగోలు సక్రమంగా సజావుగా సాగాలన్నా ఇకెవైసి తప్పనిసరని, ప్రతి రైతూ ఇకెవైసి చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, సహాయ సంచాలకులు కెఎఎస్-ఎస్.శ్రీనివాసరావు, మండల వ్యవసాయ శాఖాధికారి బి.సంధ్య, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

అర్జీలు అత్యంత బాధ్యతతో పరిశీలించాలి : జెసి

ప్రజాశక్తి - భీమవరం

'మీకోసం' ద్వారా వచ్చే అర్జీలను అత్యంత బాధ్యతతో పరిశీలించి సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా జాయిం ట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి 164 వినతులను డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావుతో కలిసి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ మీకోసం ఫిర్యాదులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వయోవృద్ధుల అప్పిలేట్ ట్రిబ్యునల్ మేళం దుర్గాప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆచంట సబ్ రిజిస్ట్రార్‌గా వెంకటపతి రాజు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట మండల సబ్ రిజిస్ట్రార్‌గా కె.వెంకటపతిరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పెనుగొండ మండలం నుంచి బదిలీపై ఆచంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన కమల కుమారి వీరవాసరం మండలం సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన వెంకటపతి రాజును పలువురు దస్తావేజు లేఖర్లు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మత విద్వేషంలోకి విద్యార్థులు..!

కలెక్టరేట్ వద్ద విహెచ్‌పి ఆధ్వర్యాన నిరసనలో విద్యార్థులు

ప్రజాశక్తి - భీమవరం

మత విద్వేషాలకు దూరంగా ఉంచాల్సిన విద్యార్థులను బిజెపి, విహెచ్‌పి తిరుపతి లడ్డూ కల్తీపై నిరసనల్లో భాగస్వాములను చేయడం అందరినీ విస్మయపరుస్తోంది. భీమవరంలోని కలెక్టరేట్ వద్ద విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో తిరుమల ప్రసాదం అపవిత్రతపై న్యాయ విచారణ జరిపించాలని సోమవారం నిరసన చేపట్టారు. ఆకివీడుకు చెందిన ఓ ప్రయివేటు విద్యాసంస్థ బస్సు కలెక్టరేట్ వద్దకు వచ్చింది. ఆ బస్సులో నుంచి పెద్దసంఖ్యలో విద్యార్థులు దిగడంతో వారు తమ సమస్యలు జిల్లాస్థాయి అధికారులకు చెప్పుకునేందుకు వచ్చారేమోనని అంతా భావించారు. అయితే ఆ విద్యార్థులు బస్సు దిగగానే దేవాదాయ శాఖను రద్దు చేయాలని కోరుతూ నినదిస్తూ విహెచ్‌పి నిరసన వద్దకు చేరారు. దీంతో అక్కడున్న వారంతా నివ్వెరపోయి మతపరమైన నిరసనల్లో విద్యార్థులను భాగస్వాములను చేయడం ఏమిటని ఆక్షేపించారు. ర్యాలీగా వస్తున్న విద్యార్థులను అక్కడే ఉన్న భీమవరం టౌన్ సిఐ నాగరాజు ఆపి విద్యార్థులను అడిగే ప్రయత్నం చేసినప్పటికీ వారు సమాధానం చెప్పకుండా ముందుకు సాగారు. దీంతో ఆయన ఆ విద్యాసంస్థ ఉపాధ్యాయులను ఇటువంటి కార్యక్రమాలకు విద్యార్థులను ఎలా తీసుకొస్తారని ప్రశ్నించారు. దీనిపై వారు సరైన సమాధానం చెప్పకుండా నీళ్లు నమిలారు. ఏదో కార్యక్రమం అంటే వచ్చామే తప్ప తమకూ తెలియదంటూ దూరంగా వెళ్లిపోయారు. దీంతో విహెచ్‌పి నేతలు విద్యార్థులను నిరసన వెనక్కు వెళ్లమని చెప్పి అక్కడ విహెచ్‌పి జెండాలు, ఫ్లకార్డులిచ్చి తిలకం అద్దారు. దీంతో విద్యార్థులు నేరుగా నిరసనలో పాల్గొని నినాదాలు చేశారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులను మత విద్వేషాలకు దూరంగా ఉంచాలని నిబంధన ఉన్నప్పటికీ కలెక్టరేట్ సాక్షిగా ఉల్లంఘించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. చివరకు విద్యాశాఖ అధికారులు కూడా పట్టీపట్టనట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కలెక్టరేట్ వద్ద జరిగిన నిరసనలో పాల్గొన్న విద్యార్థులు

దేవాదాయ శాఖను రద్దు చేయాలి

దేవాదాయ, ధర్మాదాయ శాఖను రద్దు చేయాలని విహెచ్‌పి ప్రాంతీయ కార్యనిర్వహణాధ్యక్షులు వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద నిరసనలో ఆయన మాట్లాడుతూ తిరుమల లడ్డూ వివాదంపై సిట్టింగ్ న్యాయమూర్తులతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

కాల్'మనీ' కలకలం..!

ఏలూరు నగరంలో కాల్‌మనీ వ్యాపారం జడలు విప్పింది. సామాన్య ప్రజానీకాన్ని వడ్డీల పేరుతో పీక్కుతింటున్నారు. ఇంట్లో మహిళలను తీవ్రంగా అవమానపరుస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. రూ.వేలల్లో తీసుకున్న అప్పుకు రూ.లక్షల్లో వడ్డీ కట్టినా ఇంకా తీరకపోవడంతో బాధితులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. కాల్‌మనీ బాధలు తట్టుకోలేని బాధితులు రోడ్డెక్కి ఎంఎల్‌ఎ బడేటి చంటిని, పోలీసులను ఆశ్రయించడంతో అసలు విషయం వెలుగుచూసింది. కాల్‌మనీ వ్యాపారం సాగిస్తున్న మేడపాటి సుధాకర్‌రెడ్డి, ఆయన అనుచరులపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమను ఈ బాధల నుంచి కాపాడండని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ఎస్‌పి కార్యాలయం వద్ద బాధితులు

ఏలూరు నగరంలో జడలు విప్పిన కాల్‌మనీ వ్యాపారం

సామాన్య ప్రజానీకమే టార్గెట్‌గా దందా

రూ.25 వేల అప్పుకు రూ.ఐదు లక్షలు కట్టినా ఇంకా తీరని వైనం

ప్రతి మంగళవారం వడ్డీ సొమ్ము కట్టకపోతే నరకయాతనే

మహిళలపై దౌర్జన్యం, అసభ్య పదజాలంతో దూషణలు

ఎంఎల్‌ఎ బడేటి చంటి ఆధ్వర్యంలో ఎస్‌పిని కలిసిన 30మందికిపైగా బాధితులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ఏలూరు స్పోర్ట్స్, సిటీ

రెక్కాడితేగాని డొక్కాడని సామాన్య ప్రజానీకాన్ని కాల్‌మనీ వ్యాపారులు జలగల్లా పీక్కుతుంటున్న వైనం ఏలూరు నగరంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన మేడపాటి సుధాకర్‌రెడ్డి, ఆయన అనుచరులుగా ఉన్న మహ్మద్‌అఖిల్ రెహ్మన్, గూడవల్లి విద్యాసాగర్, రాజేష్, లావణ్య కాల్‌మనీ పేరుతో సాగిస్తున్న దందా తెలిసి నగర ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఏలూరు నగరంలో రోజువారీ పనులు చేసుకునేవారు, చిరుద్యోగులు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని టార్గెట్‌గా చేసుకుని కాల్‌మనీ వడ్డీ వ్యాపారాన్ని మేడపాటి సుధాకర్‌రెడ్డి తన అనుచరులతో చాలాకాలంగా సాగిస్తున్న తీరు బాధితులు రోడ్డెక్కడంతో బయటపడింది. కాల్‌మనీ పేరుతో సుధాకర్‌రెడ్డి సాగిస్తున్న దురాగతలను బాధితులు ఒకొక్కటిగా చెబుతూ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తీసుకున్న అప్పునకు ప్రతి మంగళవారం వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. అవసరాన్ని బట్టి వడ్డీ అనేది నిర్ణయిస్తారు. రూ.70 వేలు అప్పుగా తీసుకుంటే వారానికి రూ.25 వేలు వడ్డీ వసూలు చేస్తున్నారు. రూ.25 వేలు అప్పు తీసుకుంటే వారానికి రూ.వెయ్యి వడ్డీ కట్టాలి. వచ్చిన వారి అవసరాన్ని బట్టి వడ్డీ అనేది నిర్ణయం ఉంటుందని బాధితులు చెబుతున్నారు. మంగళవారం సాయంత్రం ఏడుగంటల్లోపు వడ్డీ కట్టకపోతే రెట్టింపు సొమ్ము కట్టాల్సి ఉంటుందని, ఎదురు ప్రశ్నిస్తే ఇష్టానుసారంగా మాట్లాడి హింస పెడతారని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఎస్‌పికి ఇచ్చిన ఫిర్యాదులో అనేక అంశాలను బాధితులు వివరంగా తెలిపారు. అప్పు తీసుకున్న వారి నుంచి ఐదు ఖాళీ ప్రామిసరీ నోట్లు, వంద రూపాయల స్టాంప్ పేపర్లు రెండు, సంతకాలు పెట్టిన తెల్ల కాగితాలు రెండు తీసుకుంటారని బాధితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇచ్చిన అప్పునకు వసూలు చేస్తున్న సొమ్ముకు అసలు సంబంధం ఉండదని చెబుతున్నారు. వడ్డీలు కట్టకపోతే ఇళ్లకు వచ్చి భార్యలను, ఇంట్లో పిల్లలను అసభ్య పదజాలంతో బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. భర్తలు ఇంటి దగ్గర లేని సమయంలో రాత్రి ఎనిమిది గంటల నుంచి పది గంటల మధ్యలో వచ్చి లైంగిక దాడులు చేస్తారని బాధితులు ఫిర్యాదులో తెలిపారు. కొంతమంది వైసిపి చోటా నేతలతో కలిసి ఇళ్లపైన దాడులు చేస్తున్నారన్నారు. భౌతికదాడులకు పాల్పడతారని, వీరి ఆగడాలు భరించలేక కొంతమంది ఆత్మహత్యకు పాల్పడినట్లు బాధితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. కొంతమంది వేరే ప్రాంతాలకు వెళ్లిపోయి కూలి పనులు చేసుకుంటూ తల దాచుకుంటున్నట్లు చెబుతున్నారు. కొంతమంది అనారోగ్యం పాలై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితులు ఉన్నట్లు ఫిర్యాదులో తెలిపారు. అప్పు కట్టకపోతే ఉన్న ఆస్తులను బలవంతంగా రాయించుకుంటున్నట్లు బాధితులు చెబుతూ ఆవేదనకు గురవుతున్నారు. దేవాలయాల్లోని అర్చకులు సైతం వీరి బాధితులుగా ఉండటం గమనార్హం.

ఎంఎల్‌ఎ ఆధ్వర్యంలో ఎస్‌పికి ఫిర్యాదు

కాల్‌మనీ బాధితులంతా ఆదివారం రాత్రి ఎంఎల్‌ఎ బడేటి చంటిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. సోమవారం ఎంఎల్‌ఎ చంటి బాధితులందరినీ తీసుకుని ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్‌ను కలిసి ఫిర్యాదు ఇప్పించారు. కాల్‌మనీ వేధింపులపై చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌ఎ ఎస్‌పిని కోరారు. కాల్‌మనీ బాధితులు దాదాపు 30 మంది ఎస్‌పిని కలిసిన వారిలో ఉన్నారు. సమస్య తీవ్రమైంది కావడంతో బాధితుల నుంచి పోలీసులు విడివిడిగా ఫిర్యాదులు తీసుకుంటున్నారు. ఏలూరు డిఎస్‌పి కార్యాలయంలో బాధితులంతా విడివిడిగా ఫిర్యాదులిచ్చారు. పోలీసులు విచారణ చేపట్టి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

రూ.70 వేలు తీసుకుని ఇప్పటి వరకూ రూ.12 లక్షలు వడ్డీ కట్టాను..

మైలవరపు నాగేశ్వరశర్మ, ఏలూరు దక్షిణపు వీధి

నేను అర్చకత్వం చేస్తాను. అవసరం నిమిత్తం 2019లో మేడపాటి సుధాకర్‌రెడ్డి వద్ద రూ.70 వేలు అప్పు తీసుకున్నాను. వారానికి రూ.25 వేలు వడ్డీ కట్టాలన్నారు. 2023 డిసెంబర్ నాటికి రూ.12 లక్షలు వడ్డీ రూపంలో చెల్లించాను. ఇంక కట్టలేకపోయాను. తీవ్రంగా ఇబ్బందులు పెడుతున్నారు. పోలీసులు తగు చర్యలు తీసుకుని న్యాయం చేయాలి.

మహిళల దగ్గర అసభ్యంగా మాట్లాడతారు

అయిలూరి రాజేష్ శర్మ, ఏలూరు, కాల్‌మనీ బాధితుడు

మేడపాటి సుధాకర్‌రెడ్డి వద్ద అవసరం నిమిత్తం రూ.లక్షా 20 వేలు అప్పు తీసుకున్నాను. 2021 నుంచి 2024 జనవరి వరకూ రూ.ఎనిమిది లక్షల 51,900 వడ్డీ రూపంలో కట్టాను. వడ్డీ సొమ్ము మొత్తం ఫోన్‌పే ద్వారానే చెల్లించాను. వివరాలు సైతం ఉన్నాయి. తెల్లకాగితాలపై, ప్రామిసరీ నోట్లపై సంతకాలు తీసుకున్నారు. వడ్డీ కట్టడం ఆలస్యమైతే ఇంటికొచ్చి మహిళల పట్ల అసభ్యంగా వ్యవహరిస్తారు. న్యాయం చేయాలని కోరుతున్నాం.

రూ.25 వేల అప్పుకు రూ.5 లక్షల వడ్డీ కట్టాం

నాగదుర్గాలక్ష్మి, ఏలూరు, కాల్‌మనీ బాధితురాలు

మా ఆయన పౌరోహిత్యం చేస్తారు. 2021లో రూ.25 వేలు అప్పుగా తీసుకున్నాం. వారానికి వడ్డీ రూ.వెయ్యి చెల్లించాలన్నారు. ఆలస్యమైతే రెట్టింపు వడ్డీ వసూలు చేసేవారు. ఇప్పటి వరకూ రూ.ఐదు లక్షలు వడ్డీ కింద కట్టడం జరిగింది. డబ్బులు సకాలంలో చెల్లించకపోతే వారి పెట్టే బాధలు భరించలేనివిగా ఉంటాయి.[3]

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

ప్రజాశక్తి – పెనుగొండ

జాతీయ సేవా పథకం రెడ్ రిబ్బన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆపద్బంధు బ్లడ్ బ్యాంక్ పాలకొల్లు వారి సహకారంతో రక్తదాన శిబిరం సోమవారం నిర్వహించారు. ఎస్‌వికెపిఅండ్ డాక్టర్ కెఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో 42 మంది విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వైవిఎ.అప్పారావు, రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ టి.రమేష్ మాట్లాడుతూ ఇంతవరకు ప్రతిరోజు పెనుగొండ పరిసర ప్రాంతాల వారికి అవసరం మేరకు రోజుకొకరు చొప్పున విద్యార్థులు రక్తదానం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు టి.దివాకర్, ఆర్ఎస్ శ్రీనివాస్, పి.మీరయ్య పాల్గొన్నారు..

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

కాళ్ల:పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.సూర్యకుమారి అన్నారు. కాళ్ల సెక్టార్ పరిధిలోని కాళ్ల అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.సునీల్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు వ్యక్తిగత శుభ్రతను పాటిస్తూ తక్కువ ఖర్చుతో అధిక బలాన్ని ఇచ్చే ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, పాలు ఎక్కువగా తీసుకొని రక్తహీనత పౌష్టికాహార లోపం లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి బందా విజయ, ఉప సర్పంచి అబ్బులు, ఎఎన్‌ఎం, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపికి వార్డు కౌన్సిలర్ గంగరాజు రాజీనామా

నరసాపురం:నరసాపురంలోని 19వ వార్డు వైసిపి కౌన్సిలర్ కేసరి గంగరాజు వైసిపి సభ్యత్వానికి సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖను వైసిపి జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజుకు పంపినట్లు ఆయన విలేకరులకు తెలిపారు. వ్యక్తిగత కారణాలతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు.

చిరస్మరణీయుడు డాక్టర్ ప్రసాద్ : ఎంఎల్ఎ

తాడేపల్లిగూడెం:ప్రజా వైద్యుడు పిఎల్‌వి.ప్రసాద్ శారీరకంగా మన మధ్య లేకపోయినా ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడుగా నిలిచి ఉన్నారని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. డాక్టర్ ప్రసాద్ జయంతి సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. షటిల్ బ్యాట్‌మెంటెన్ విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్రో నగరాల స్థాయిలో ఈ స్పోర్ట్స్ ఎరేనా నిర్మించి ఎంతోమందికి శిక్షణ ఇస్తున్న నిర్వాహకులు అభినందనీయులన్నారు. అతి త్వరలోనే ప్రసాద్ విగ్రహాన్ని పున:ప్రతిష్టిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ప్రసాద్ సతీమణి శోభారాణి, డాక్టర్ వర్మ పాల్గొన్నారు.

గుండెపోటుతో న్యాయవాది, విలేకరి మోతీలాల్ మృతి

మోతీలాల్ (ఫైల్‌ఫొటో)

ఆచంట:పోడూరు గ్రామానికి చెందిన అడ్వకేట్, సీనియర్ పాత్రికేయులు నేలపాటి మోతీలాల్ (57) గుండెపోటుతో ఆదివారం రాత్రి ఆకస్మిక మృతి చెందారు. ఆదివారం రాత్రి ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హుటాహుటీన పాలకొల్లు ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మోతీలాల్ వివిధ పత్రికల్లోనే కాకుండా అడ్వకేట్‌గా పనిచేస్తున్నారు. ఆయన పెద్ద కుమార్తె బినూష అమలాపురం కిమ్స్ హాస్పిటల్‌లో నర్స్‌గా పనిచేస్తోంది. చిన్న కుమార్తె జినుషా ప్రయివేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. కుమారుడు డిగ్రీ చదువుతున్నాడు. మోతీలాల్ మృతి చెందడంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయి రోడ్డున పడింది. ఆయన మృతితో పోడూరులో విషాద చాయలు అలుముకున్నాయి. మోతీలాల్ మృతి పట్ల పోడూరు మండల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు, పాలకొల్లు అడ్వకేట్లు సంతాపం తెలిపారు. కుటుంబానికి సానుభూతి తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలను నిరసించాలి

ఆకివీడు:కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ పిలుపునిచ్చారు. సిపిఎం 14 వార్డు ఐదో శాఖా మహాసభ సోమవారం స్థానిక మిద్దేవారి వీధిలో జరిగింది. పార్టీ నాయకురాలు డ్వాక్రా లక్ష్మీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గోపాలన్ పాల్గొని మాట్లాడారు. పార్టీ పట్టణ కార్యదర్శి కె.తవిటి నాయుడు పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన శాఖ నూతన కమిటీ ఎన్నికల్లో సందక ఉదయ కుమారి నూతన కార్యదర్శిగా, మరో ఏడుగురు సభ్యులతో ఏకగ్రీవంగా నూతన శాఖ కమిటీ ఏర్పడింది.

విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు

తాడేపల్లిగూడెం:చినతాడేపల్లి గ్రామంలోని శ్రీచైతన్య ఒలింపియాడ్ పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా సోమవారం విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. శ్రీచైతన్య యాజమాన్యం ప్రతి నెలా ఏదో ఒక అంశంపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం హెల్తీ ఇండియాలో భాగంగా విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. పట్టణానికి చెందిన వైద్యనిపుణులు కోడూరి భాను సత్యనారాయణ, డాక్టర్ మేఘన సిబ్బంది పాఠశాలలోని వెయ్యి మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ భాను సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి ప్రసాద్ మాట్లాడారు. ఎజిఎం పార్థసారథి, కోఆర్డినేటర్ రామారావు, పాఠశాల డీన్ నాగార్జున, ఇన్‌ఛార్జి సత్యనారాయణ పాల్గొన్నారు.

వలందరరేవులో స్వచ్ఛతా హి సేవా

ప్రజాశక్తి – నరసాపురం

పట్టణంలో వశిష్ట గోదావరి తీరాన వలంధర రేవులో సోమవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. పెన్నాడకు చెందిన భీమవరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కొప్పర్తి సురేష్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఘాట్లను శుభ్రపర్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సురేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ కన్వీనర్ మేకల సతీష్, ఎం.దిలీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి – నరసాపురం

ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆర్‌డిఒ దాసి రాజు అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిస్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 27 ఫిర్యాదులు వచ్చాయని ఆర్‌డిఒ తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన ఆర్‌డిఒ వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామాజిక విషయాలు తెలియజేయాలి

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి – ఉండి

విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక, వైజ్ఞానిక విషయాలను తెలియజేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం మహదేవపట్నంలోని ఉప్పరగూడెం ఎంపిపి స్కూల్‌ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె క్లాస్ రూమ్‌లు, వంటశాల, పరిసరాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వంట పదార్థాల స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం సమయానికి పెడుతున్నారా, ఆహార పదార్థాలు రుచిగా ఉంటున్నాయా అని కలెక్టర్ ఆరాతీయగా బాగుంటున్నాయని విద్యార్థులు బదులిచ్చారు. క్లాస్ రూమ్‌కు వెళ్లి ఉపాధ్యాయులు పాఠాలు ఎలా చెబుతున్నారు.. అర్థమవుతున్నాయా అని అడిగి, కొన్ని ప్రశ్నలు వేసి జిల్లా కలెక్టర్ సమాధానం రాబట్టారు. బాగా చదువుకుని ఉన్నత విద్యనభ్యసించి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. పాఠశాలలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తక్షణం ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. అప్పుడే సమస్యను పరిష్కరించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. అనంతరం పాఠశాల గార్డెన్ నిర్వహణ, మధ్యాహ్న భోజనం పట్ల జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి ఎంతమంది చిన్నారులు వస్తున్నారు, వారికి మెనూ ప్రకారం ఆహారం అందజేస్తున్నారా అని ప్రశ్నించారు. అలాగే గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయొద్దని సూచించారు. ఆమె వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు కలిదిండి రవికుమార్ వర్మ, ఉపాధ్యాయిని బొక్కా సుమలత, నాయకులు వేగేశ్న సీతారామరాజు, పంచాయతీ కార్యదర్శి కాళీపట్నం పవన్ కుమార్, విఆర్‌ఒ చిన్నారావు ఉన్నారు.

ఎఎస్ఎన్ఎంలో సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి – పాలకొల్లు

స్థానిక అడ్డేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాలలో సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన మొదటి సేంద్రియ కూరగాయలను కళాశాల ప్రిన్సిపల్ బి.రాజారాజేశ్వరి సోమవారం ప్రదర్శించారు. వృక్షశాస్త్ర విభాగం నేతృత్వంలోని ఈ ప్రాజెక్ట్, విద్యార్థులు, సమాజంలో స్థిరమైన వ్యవసాయం, పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి కళాశాల బెస్ట్ ప్రాక్టీస్‌లో భాగంగా సేంద్రియ వ్యవసాయ విధానాన్ని ఈ సంవత్సరం ప్రారంభించారు. స్థిరమైన వ్యవసాయ పద్ధతులలో విద్యార్థులు, అధ్యాపక నిపుణుల మార్గదర్శకత్వంలో, కృత్రిమ పురుగుమందులు లేదా ఎరువులు ఉపయోగించకుండా సేంద్రియ పద్ధతులను ఉపయోగించి వివిధ పంటలను సాగు చేస్తున్నారు. ఆచరణీయమైన, పర్యావరణ అనుకూలమైన వ్యవసాయ పద్ధతులను ప్రదర్శించడం ద్వారా స్థానిక వ్యవసాయ ఉత్పత్తులు సమాజానికి మద్దతునిచ్చే విధంగా కళాశాల ప్రయత్నిస్తోందని ప్రిన్సిపల్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కృష్ణ, బోటనీ అధ్యాపకులు శ్రీనివాసరావు, శిరీష పాల్గొన్నారు.

CERTIFICATES MISSING

Rajesh Gangadhar Maraju on his way to Narsapur town to make xerox of his 12th std Statement of Marks (No. 70003361) and Pass Certificate (No.10003358) has lost his documents. His full name is **Rajesh Gangadhar Maraju** with the index no. 2213174/037, he passed in the year of 2021 in Flaiz Memorial Higher Secondary School of Seventh Day Adventist, Narsapur 534275.

పాత్రికేయుడు ఉదయ్ భాస్కరరావుకు సత్కారం

ప్రజాశక్తి – యలమంచిలి

సీనియర్ పాత్రికేయుడు ఉదయ్ భాస్కరరావును సత్కరిస్తున్న సర్పంచి

సీనియర్ పాత్రికేయుడు మండలంలోని కొంతేరు గ్రామానికి చెందిన గుమ్ములూరి ఉదయభాస్కరరావుకు పెదలంక సర్పంచి, ప్రముఖ న్యాయవాది తాళ్ల నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సోమవారం పెద్దలంక గ్రామంలో భాస్కరరావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచి నాగరాజు మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాన్ని చూపుతూ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఒక బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తుండడం అభినందనీయమన్నారు. సీనియర్ పాత్రికేయుడిగా భాస్కరరావు 30 ఏళ్లుగా ఎంతో నీతి నిజాయతీగా పాత్రికేయ వృత్తిని కొనసాగిస్తున్నారని తెలిపారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఏటా ఏదో ఒక అవార్డు తీసుకుంటున్నారంటే అది ఆయన నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముసుకూడి రాంబాబు, టిడిపి నాయకులు పులి శ్రీరామ్మూర్తి, కనకాలంక మాజీ సర్పంచి కడలి సత్యనారాయణ, బండాడ బుజ్జి, నెల్లి ఆనందరావు, ఏలంగి శేషగిరి, కుక్కల ముసలయ్య, వడ్డీ బాల, నీతిపూడి రాజు, నీతిపూడి సత్యనారాయణ, కత్తిమండ ప్రసాద్, నీతిపూడి రాజేష్, మండల వెంకటేశ్వరరావు, ఎ.శ్రీను, ఏడుకొండలు, విఆర్ఒ లక్ష్మి పాల్గొన్నారు.

పాలకొల్లు ఎక్సైజ్ సిఐగా శ్రీనివాస్

పాలకొల్లు :పాలకొల్లు ఎక్సైజ్ సిఐగా మద్దాల శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన తాడేపల్లిగూడెం నుంచి బదిలీపై పాలకొల్లు విచ్చేశారు. ఆయన 2015 నుంచి 2019 వరకూ పాలకొల్లు సిఐగా పనిచేసి పెనుగొండ బదిలీపై వెళ్లారు. శ్రీనివాసరావుకు ఎక్సైజ్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ప్రభుత్వ నిబంధనలను బ్రాందీ షాపులు, రెస్టారెంట్ అండ్ బార్ల యజమానులు అమలు చేయాలన్నారు.

నరసాపురం ఎక్సైజ్ సిఐగా రాంబాబు

నరసాపురం:నరసాపురం ఎక్సైజ్ సిఐగా ఎస్.రాంబాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన తూర్పుగోదావరి జిల్లా నుంచి నరసాపురానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన మద్యం పాలసీపై ఈనెల 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ నోటిఫికేషన్ ఇస్తారని, 15వ తేదీ వరకూ ప్రభుత్వ దుకాణాలు కొనసాగుతాయని ఆయన చెప్పారు.

ఎక్సైజ్ ఎస్ఐగా ఖాసిం

నరసాపురం ఎక్సైజ్ ఎస్ఐగా ఎస్.ఖాసిం సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రాజోలు నుంచి నరసాపురానికి బదిలీపై వచ్చారు. ఎస్ఐగా తాడేపల్లిగూడెం, పాలకొల్లు స్టేషన్లో ఆయన పనిచేశారు. ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా 1992లో సర్వీస్ ప్రారంభించి, ఎస్ఐగా 2020లో ప్రమోషన్ వచ్చింది.

ఆచంట తహశీల్దార్‌గా సోమేశ్వరరావు

ఆచంట:ఆచంట తహశీల్దార్‌గా ఎం.సోమేశ్వరరావు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్‌గా వి.కిషోర్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సోమేశ్వరరావు భీమవరం డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఆచంట తహశీల్దార్‌గా పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్‌గా వి.కిషోర్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా విఆర్‌ఒల సంఘం మండల అధ్యక్షులు మిరియాల శేషగిరిరావు, డిప్యూటీ తహశీల్దార్ సుగుణ సంధ్య, ఆర్ఐ జయలలిత వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పార్టీలకతీతంగా గ్రామాలను అభివృద్ధి చేయాలి

పాలకోడేరు ఎంపిపి చంటిరాజు

పాలకోడేరు :పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేయాలని పాలకోడేరు మండల పరిషత్ అధ్యక్షులు భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటిరాజు) అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి చంటి రాజు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలు పార్టీలను పక్కనపెట్టి గ్రామ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విస్సాకోడేరు సర్పంచి బొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో డంపింగ్ యార్డ్ నిర్మించడం జరిగిందని, అయితే ఎన్‌ఆర్‌జిఎస్ సిబ్బంది సహకరించకపోవడంతో బిల్లులు రాక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్నాడ ఎంపిటిసి ఆదాడ లక్ష్మీతులసి మాట్లాడారు. సమావేశంలో సర్పంచులు, సర్పంచులు అధికారులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి : సిఐ

తాడేపల్లిగూడెం:ద్విచక్ర వాహనదారులు ప్రాణ రక్షణ కోసం హెల్మెట్ వినియోగించాలని సిఐ ఎ.సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయలు సెంటర్లో విజిబుల్ పోలీసింగ్ , హెల్మెట్ వినియోగంపై ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు .హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వాహనదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై కొండలరావు ,ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాల బస్సు, కారు ఢీ

పాలకోడేరు :కళాశాల బస్సు, కారు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటన మండలం పరిధిలోని వేండ్ర గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నవుడూరు నుంచి భీమవరం 25 మంది విద్యార్థులతో వెళ్తున్న ఓ కళాశాల బస్సు వేండ్ర వంతెన దిగుతుండగా భీమవరం నుంచి ఎదురుగా వస్తున్న కారును ఢీ కొట్టింది. విద్యార్థులకు ఎటువంటి గాయాలు కాలేదు. కారులో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు పెద్దవాళ్లతోపాటు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాద సమయంలో కారుబెలూన్లు తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. చిన్న గాయాలతో బయటపడ్డారు. వీరిని భీమరంలోని, భీమవరం ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు.

సొసైటీ సభ్యులకు 9 శాతం డివిడెంట్

ప్రజాశక్తి – నరసాపురం

అర్బన్ సొసైటీ సభ్యులకు ఈ ఏడాది తొమ్మిది శాతం డివిడెంట్ ఇవ్వాలని సోమవారం జరిగిన మహాజన సభ తీర్మానించింది. సొసైటీ అధ్యక్షులు ద్వారా హేమకుమార్ అధ్యక్షతన సొసైటీలో జరిగిన సమావేశంలో బ్యాంకు ఆర్థిక లావాదేవీలను సభ్యులకు వివరించారు. 15 ఏళ్ల క్రితం సంక్షోభంలో కూరుకు పోయిన బ్యాంకు ప్రస్తుతం రూ.22 కోట్లు డిపాజిట్లు కలిగి ఉందన్నారు. ఇతర బ్యాంకుల్లో రూ.8 కోట్లు పొదుపు చేయడం జరిగిందన్నారు. 2023–24 సంవత్సరానికి గాను సంఘం రూ.87 లక్షల పైబడి నికరలాభం సాధించిందన్నారు. సొసైటీ అభివృద్ధిలో భాగస్వామ్యం అయిన పాలకమండలి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.గోపాలకృష్ణ, బి.సత్యనారాయణ, కె.సత్యనారాయణమూర్తి, వెంకట శ్రీనివాస్, కె.శ్రీనివాస్, మస్తాన్, కె.వెంకటేశ్వరరావు, పి.రంగారావు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

ప్రజాశక్తి – మొగల్తూరు

సొసైటీ నుంచి తీసుకున్న రుణాలు రైతులు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని ఆఫీషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి ఆర్.నరేంద్ర కుమార్ సూచించారు. మొగల్తూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. సంఘం ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తేనే సంఘం మనుగడ ఆధారపడి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా 2023–24 ఆడిట్ రిపోర్టును జమా ఖర్చులను చదివి వినిపించారు. ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.28.18 లక్షల నికర ఆదాయం వచ్చిందన్నారు. గత ఆరునెలల కాలంలో సుమారు 56 మంది రైతులు బయటకు వెళ్లిపోగా నూతనంగా 18 మంది రైతులు సభ్యత్వం తీసుకున్నారన్నారు. ఈ సమావేశంలో సొసైటీ కార్యదర్శి కొత్తపల్లి గోవిందరాజులు, రైతులు నిప్పులేటి తారక రామారావు, గట్టెం శ్రీను, గుత్తుల గాంధి, బస్వాని ఏడుకొండలు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు కొమ్ముగూడెం విద్యార్థులు

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

మండలంలోని కొమ్ముగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో అండర్–17, అండర్–14 బాలుర, బాలికల విభాగాల్లో వాలీబాల్, కబ్బడీ, అథ్లెటిక్స్, యోగాలో క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జిల్లా స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఇదే క్రీడాస్ఫూర్తిని కొనసాగిస్తూ రాష్ట్రస్థాయిలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తాడేపల్లి బేబి, ఎంపిటిసి సూర్పని రామకృష్ణ, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ పందిరి వెంకటేష్, పిడి సుభద్ర పాల్గొన్నారు.

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యం

భీమవరం ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి – వీరవాసరం

'మడుగుపోలవరంలో గతంలో నేను చేసిన అభివృద్ధే తప్ప గత ఐదు సంవత్సరాల కాలంలో వైసిపి ప్రభుత్వం చేసిందేమీ లేదు' అని భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు.ట మడుగుపోలవరంలో రూ.39 లక్షలతో పునరుద్దరించనున్న మంచినీటి పథకం పనులను సోమవారం అంజిబాబు ప్రారంభించారు. జలజీవన్‌మిషన్ నిధులతో 655 మీటర్ల పైపులైను విస్తరించనున్నారు. అలాగే 40 వేల లీటర్ల సామర్థ్యంతో ఒహెచ్ఆర్‌ను నిర్మించనున్నారు. ఎంపిపి గంగాభవాని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ మాట్లాడుతూ నవుడూరు నుండి మడుగుపోలవరం లంక వరకు ఉన్న ఆర్అండ్‌బి రహదారిని రూ.16 కోట్లతో డబుల్‌లైన్ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలుస్తున్నట్లు తెలిపారు. స్థానిక మహిళల అభ్యర్థన మేరకు జగనన్న లేఅవుట్లలో రోడ్లను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తానన్నారు. పాఠశాల వద్ద ప్రమాదభరితంగా ఉన్న ఓహెచ్ఆర్ స్థానంలో కొత్త ఓహెచ్ఆర్‌ను నిర్మిస్తానన్నారు. మండల పరిషత్ నిధులతో చేపట్టబోయే పనులను కూడా త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచి బోణం ప్రకాశరావు, కోళ్ల నాగేశ్వరావు, ఎంపిటిసి అంగర కుటుంబరావు, వీరవల్లి చంద్రశేఖర్, యరకరాజు చినబాబు పాల్గొన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో అవయవదానం చేసిన పోలిశెట్టి రేవంత్‌శ్రీమురహరి కుటుంబాన్ని., అడిదెల చిరంజీవి కుటుంబాన్ని ఎంఎల్ఎ పరామర్శించారు.

వేలం ప్రకటన
మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No.42/2019 in O.S.No.369/2014
డి. హెచ్. ఆర్: చెవ్వూరి బాలకృష్ణ
VS
జె. డి. ఆర్: పోలిశెట్టి శ్రీనివాసరావు
ఇ.పి. షెడ్యూలు
1) పశ్చిమ గోదావరి జిల్లా, మొగల్తూరు, మండలం, మొగల్తూరు సబ్ రిజిస్ట్రర్‌లో చేరిన మొగల్తూరు గ్రామం తాలూక ఆర్.ఎస్.నెం. 932/5లో య.0–16ట్లు లో కొబ్బరి చెట్లుతో సహా హద్దులు:
తూర్పు: పులపర్తి సూర్యనారాయణ మరియు పంట బోది. **దక్షిణం:** పులపర్తి కాశీవిశ్వనాథం గారి కొబ్బరి తోట. **పడమర:** యాతం వెంకట నరశింహస్వామి గారి భూమి. ఈ హద్దుల మధ్య య.0–16ట్లు భూమి, ఇందలి నానావిధ ఫల వృక్షములతో సహా.
2) ఆర్.ఎస్.నెం.694/3లో య.0–48ట్లు మామిడి తోటకు హద్దులు:
తూర్పు: చెన్ను సూరిబాబు. **దక్షిణం:** ఇతరుల ఇల్లు. **పడమర:** కొప్పినీడి శేషారావు. **ఉత్తరం:** అనంతపల్లి కామేశ్వరరావు. ఈ హద్దుల మధ్య య.0–48ట్లు భూమి, ఇందలి నానావిధ ఫల వృక్షములతో సహా.
పై ఆస్థిని డి.హెచ్.ఆర్. బాకీ వసూలు నిమిత్తం పై కోర్టు వారు **ది.18-10-2024 సం॥రం తేదీన ఉదయం గం॥10:30 ని॥ల లగాయితు కోర్టులో వేలములో విక్రయించెదరు.** కాబట్టి పుర ప్రజలు సదరు వేలంలో పాల్గొని సదరు ఆస్థిని వేలములో పాడుకొనవలసినదిగా కోర్టు వారు ప్రజలందరికీ ఇందుమూలముగా ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.
అయిటం–1
డి.హెచ్.ఆర్. విలువ : రూ.80,000/-
అమీనా విలువ : రూ.16,00,000/-
అయిటం–2
డి.హెచ్.ఆర్. విలువ : రూ.1,20,000/-
అమీనా విలువ : రూ.24,00,000/-
(By Order Of The Court)
శ్రీ గునిశెట్టి శ్రీనివాసరావు
డి.హెచ్.ఆర్. తరుపు అడ్వకేట్, నర్సాపురం.
నర్సాపురం, 28-09-24.
సెల్: 9553126234

ప్రకటన
మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
Debtors I.P. No.17/2024
Between:
1.రేలంగి నరసింహ స్వామి, S/o. సత్యనారాయణ, డోర్. నెం.33-9-31, అచ్చుగట్ల పాలెం, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
2.రేలంగి శ్రీరంగనాయకులు, S/o. నరసింహ స్వామి, డోర్. నెం.33-9-31, అచ్చుగట్ల పాలెం, పాలకొల్లు, ప.గో.జిల్లా. ...పిటీషనర్స్
VS
1.పడమటి సూరిబాబు, S/o.సూరన్న, ఆదిశంకర కంటి ఆసుపత్రి వద్ద, రాజీవ్ నగర్, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
2.పడిసపు శేఖర్, S/o.సత్యనారాయణ, డోర్ నెం. 33-7-5, అచ్చుగట్లపాలెం, పాలకొల్లు, ప.గో.జిల్లా.
3.కొప్పినీడి పుల్లారావు, S/o. సూర్యనారాయణ, డోర్ నెం.33-12-1, రాజవీధి, అచ్చుగట్ల పాలెం, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
4.చిల్లిముంతల కృష్ణమోహనరావు, S/o.లక్ష్మయ్య, అచ్చుగట్ల పాలెం, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
5.చెక్కా కృష్ణ, S/o.పుల్లారావు, మారుతి సినిమా థియేటర్ వద్ద, అచ్చుగట్లపాలెం, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
6.కొడవటి నాగ సూర్య చంద్రశేఖర్, S/o. దత్తాత్రేయులు, House No.6A-8/1, ఫ్లాట్ నెం.202, లాక్ దిగువన, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
7.నిట్టల నాగ శ్రీనివాసు, S/o.రామారావు, నాగరాజు పేట, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
8.పంట్ల రాము, S/o.గురువులు, డోర్ నెం.7-5-21, మావుళ్ళమ్మ గుడి వెనుక, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
9.పంట్ల దుర్గారావు, S/o.రాము, డోర్ నెం.7-5-21, మావుళ్ళమ్మ గుడి వెనుక, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
10.శేగు వెంకట శివరావు, S/o. వెంకటేశ్వరరావు, డోర్ నెం.33-11-3/1, మేకా వారి వీధి, అచ్చుగట్ల పాలెం, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
11.కోరుకొండ వి.వి.ఎన్.జి.ఎస్. పార్వతి మణి కుమార్, S/o.ఆంజనేయులు, డోర్ నెం.39-1-22, త్సవటపల్లి వారి వీధి, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
12.తోట సత్యనారాయణ, S/o.సుబ్బారావు, డోర్ నెం.29-3-35, కర్ణాల వారి వీధి, సుబ్బారాయుడు గుడి వద్ద, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
13.బండారు నరసింహారావు, S/o. అప్పారావు, గంజి పేట, బంగారువారి చెరువు గట్టు, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
14.టంగుటూరి వెంకట సంతోష్ కుమార్, S/o.రమేష్, శ్రీ వెంకట సాయి ఫైనాన్స్, మారుతి థియేటర్ వద్ద, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
15.దూళిపాల మేధా దక్షిణామూర్తి, S/o. అగ్ని హోత్రులు, డోర్ నెం.10-1-46, సూర్యనారాయణ మూర్తి గుడి వద్ద, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
16.సంకు శ్రీను, S/o.అబ్బులు, డోర్ నెం.C-101 బ్లాక్, L&T కాలనీ, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
17.డోరా ప్రసాద్, S/o.అబద్దరావు, డోర్ నెం.51-5-20, రత్నశ్రీ హాస్పిటల్ వద్ద, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
18.దేవరపు సూర్యనారాయణ, S/o.సత్యనారాయణ, డోర్ నెం.25-6-14/A, శంభుని చెరువు, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
19.యర్రంశెట్టి సురేష్ కుమార్, S/o. కృష్ణారావు, సూర్య ఫైనాన్స్, మసీదు వద్ద, మెయిన్ రోడ్, పాలకొల్లు, ప.గో.జిల్లా.,
20.కాగిత అశోక్, S/o.సీతారామస్వామి, డోర్ నెం.2-49, బల్లిపాడు, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా.,
21.కాగిత ఏసురాజు, S/o.సీతారామస్వామి, డోర్ నెం.2-49, బల్లిపాడు, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా.,
22.కాగిత శ్రీనివాస రావు, S/o. సీతారామస్వామి, డోర్ నెం.2-49, బల్లిపాడు, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా.,
23.జుత్తిగ పద్మాజి శ్రీనివాసరావు, S/o. సత్యనారాయణ, డోర్ నెం.1-127, శివదేవుని చిక్కాల, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా.,
24.పాలంకి వీర వెంకట నాగ ముత్యం, S/o. సూర్యారావు, డోర్ నెం.2-73, వరిధనం, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా.,
25.నల్లమిల్లి గంగిరెడ్డి, S/o.లక్ష్మీనారాయణ, ఫ్లాట్ నెం.405, కాకినాడ, కాకినాడ జిల్లా.
26. The Official Receiver, ప.గో.జిల్లా., ఏలూరు. ...రెస్పాండెంట్స్
పై నెంబరు కేసులో పిటీషనర్స్ బాకీలు చెల్లించలేని స్థితిలో పై కోర్టులో పిటీషనర్స్ ని దివాలా కోరుదారుగా (Insolvents) ప్రకటించమని పిటీషన్ వేసినందున కోర్టు వారు ది.15-10-2024 సం.రం. తేదీనకు వాయిదా వేసియున్నారు. కావున రెస్పాండెంట్స్ కు మరియు ఎవరికైనా పై నెంబరు పిటీషనులో అభ్యం తరములు ఉన్నయెడలది.15-10-2024 సం.రం. తేదీన ఉదయం 10.30 ని.లకు స్వయంగా గాని, మీ ప్లీడర్ గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసుకోవలెను లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియచేయడమైంది.
(BY Order) **వలవల సత్యనారాయణ మూర్తి,** M.A., B.Ed., L.L.B., న్యాయవాది, పాలకొల్లు
తేదీ:29-09-2024 సెల్:9849038805

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
విలేకరులు కావలెను
మీరు జర్నలిస్టు కాదలచుకున్నారా?
మీకు సామాజిక స్పృహ ఉన్నదా?
విన్నదీ కన్నదీ పది మందితో పంచుకుందామనుకుంటున్నారా?
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు ఈ క్రింది కేంద్రాల్లో ఆసక్తి గల విలేకరులు కావలెను
అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యలపై అవగాహన
-: విలేకరులు కావాల్సిన ప్రాంతాలు :-
జంగారెడ్డిగూడెం, కైకలూరు, పెదవేగి, నిడమర్రు, లింగపాలెం, అత్తిలి, భీమవరం అర్బన్, ఇరగవరం, పెంటపాడు, పోడూరు, ఏలూరు కల్చరల్
విలేకర్లు కావలసిన రూరల్ కేంద్రాలు
నూజివీడు, విజయరాయి, కైకలూరు, ఏలూరు, జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెం, నరసాపురం, భీమవరం
ఇంటర్వ్యూ : తేది: 02-10-2024 బుధవారం ఉదయం 9.30 గంటల నుండి
ఇంటర్వ్యూ జరుగు ప్రదేశం:
ప్రజాశక్తి కార్యాలయం, బలుసువారి వీధి, పవర్‌పేట, ఏలూరు
ఫోన్ నెం: 99493 66196, 89191 70815, 94900 99168, 94900 99190

డిఇఒ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నేతలు

మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

ప్రజాశక్తి – భీమవరం

సుదీర్ఘకాలం అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీ మూర్తి డిమాండ్ చేశారు. భీమవరం కలెక్టరేట్లో విద్యాశాఖ కార్యాలయ అధికారికి యుటిఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం సోమవారం సాయంత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపీ మూర్తి మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూళ్లలో తగినంత మంది సబ్జెక్టు టీచర్లను నియమించేందుకు వీలుగా ఎస్‌సిటి, పండిట్, పిఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి రామభద్రం మాట్లాడుతూ నవంబర్‌లోగా అప్‌డెడ్ పోస్టులలో మున్సిపల్ టీచర్లకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. మున్సిపల్ ప్రధానోపాధ్యాయుల్లో అర్హులైన వారిని అర్బన్ ఎంఇఒలుగా నియమించాలన్నారు. మున్సిపల్ టీచర్లకు జిపిఎఫ్ ఖాతాలు తెరిపించాలని పేర్కొన్నారు. మున్సిపల్ టీచర్ల బదిలీలు వెంటనే చేపట్టాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో జిల్లా జనరల్ సెక్రటరీ, పట్టాబి రామయ్య, త్రినాథ్, సాయిరాం, డి.ఏసుబాబు, మాణిక్యాలరావు ఉన్నారు.

ఇ-పంట నమోదుతోనే ప్రయోజనాలు : కలెక్టర్

ప్రజాశక్తి – భీమవరం

ఇ – పంట నమోదుతోనే ప్రభుత్వ ప్రయోజనాలు సాధ్యమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కొవ్వాడ అన్నవరంలో వరి పొలాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో పంట నష్టపరిహారం పొందడానికి, రైతు సేవా కేంద్రం ద్వారా పంటను అమ్మడానికి ఇ–పంట నమోదులో ఇకెవైసి తప్పనిసరి అన్నారు. ప్రధానంగా కౌలు రైతు నష్టపోకూడదనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో రైతులు సాగుచేస్తున్న పంట వివరాలను విఆర్ఒ, విఎఎల ద్వారా ఈ పంటను నమోదు చేసి జాబితాలను అందజేయాలని ఆదేశించారు. దీనిలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా అందిన వివరాలను వాస్తవ వివరాలతో క్షేత్రస్థాయిలో పరిశీలించి సరిపోల్చి సాగుదారుని భూమి వద్దే యాప్‌లో చేయాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఎఒ నిమ్మల శ్రీనివాస్ ఉన్నారు.

సేవా కేంద్రాలను విస్తరింపజేయాలి : జెసి

రెడ్ క్రాస్ సంస్థలు సభ్యులుగా చేరి సేవా కేంద్రాలను విస్తరింపజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టిజరాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్లో రెడ్ క్రాస్ సంస్థ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశంలో డిఆర్ఒ జె.ఉదయభాస్కర్‌రావు, డ్వామా పీడీ కెసిహెచ్.అప్పారావు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి తాడేపల్లిగూడెం వారి కోర్టులో
ఐ.పి.నెం.15/2024
బిట్వీన్:
బొచ్చు రమేష్
బొచ్చు నాగమణి ...పిటీషనర్స్
మరియు
మానుపాటి మురళి వగైరాలు ...రెస్పాండెంట్స్
ఇందుమూలముగా ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లయింట్లు అయిన బొచ్చు రమేష్, బొచ్చు నాగమణిలు మానుపాటి మురళి మున్నగు వారిపై ది.27-06-2024వ తేదీన ఋణ ఎగవేత పిటీషనును దాఖలు చేసియున్నారు. కావున సదరు పిటీషనుపై ప్రజానీకానికి ఎటువంటి అభ్యంతరములు మరియు ఆక్షేపణలు ఉన్న ఐ.పి.15/2024కు **వాయిదా ది.04-10-2024వ తేదీన కలదని మీ అభ్యంతరములు మరియు ఆక్షేపణలు శ్రీ కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, లేక వకీలు ద్వారా గాని హాజరు తెలియజేయవలసినదిగా** ఈ జనరల్ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
గాజుల గోపికృష్ణ
యర్రంశెట్టి లక్ష్మీ ప్రసన్న రాణి
అడ్వకేట్స్, తాడేపల్లిగూడెం.
తాడేపల్లిగూడెం, 04-10-24.
సెల్: 98487 85739